శ్రీ రమణ జ్యోతి

జూలై 2021

# Sri Ramana Jyothi

July 2021

ఈ సంచికలో ...

IN THIS ISSUE ...

| | | | |
|---|---|---|---|
| **1.** | **డా॥ కే.యస్. గారి 84వ ప్రవచనం** | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| **2.** | **భగవాన్ నా జీవితంలో ఎలా ప్రవేశించారు** | పి. వెంకట్రామ శర్మ | 10 |
| **3.** | **శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు (శ్రీ దేవరాజ ముదలియార్)** | జి. శ్రీహరిరావు | 19 |
| **4.** | **శ్రీ భగవాన్ రమణ మహర్షి భక్తాగ్రేసరులు** | మల్లాది ఫణిమాల | 25 |
| 5. | Freedom from the Mind | Dr. K. Subrahmanian | 30 |
| 6. | Kavyakantha's Chatvarimsat | V. Krithivasan | 38 |
| 7. | My Experience at Arunachala | Dr. S.C. Roy | 41 |
| 8. | Which Comes First - Bhakthi or Gnana? | | 46 |
| 9. | The Crying Child | | 50 |

## Events in Sri Ramana Kendram in July 2021

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
3. 10th - Saturday - Punarvasu Satsang - 6.30 - 7.30 p.m.
4. 24th Sarurday - Guru Purnima

(Devotees may please note that due to social distancing, *satsangs* are being held online. For details please contact Kendram Office)

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# హేతుబద్ధత, ప్రత్యక్షానుభవం

డా॥ కే.యస్. గారి 84వ ప్రవచనం

అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

మీరు ఉద్యోగం, ఏదైనా వృత్తిలో లేదా వ్యాపకంలో వున్న రోజుల్లో దైవ ధ్యానం, జపం, పూజ లాంటి వాటిలో కొంత సమయం గడిపే అలవాటు చేసుకోనట్లైతే, ఆ బాధ్యతలు విరమించిన తరువాత కాలం ఎలా గడపాలో పాలుపోదు. ఏభై, అరవై ఏళ్ళు దాటిన తరువాత ఆధ్యాత్మిక జీవితాన్ని ప్రారంభించవచ్చునని చాలా మంది భావిస్తారు. అలా చేయడం కుదరదు. ఏ వృద్ధాప్యమో మీద పడిన తరువాత, నీరసించి పోయిన తరువాత, జబ్బుల్లో దేవుడి గురించి ఆలోచన, పూజ, జపాలు చేయలేని స్థితి ఏర్పడుతుంది. అంతకు ముందు నుండి ఆ అలవాటును పెంపొందించుకుని వుంటే, ఆ తరువాత మరింత సమయం అందులో గడపడానికి వీలవుతుంది. ఆ పరిస్థితుల్లో ఇతరులు మీ గురించి ఏమనుకుంటారన్న విషయాన్ని పట్టించుకోరు. ఎవ్వరూ మీ గురించి మాట్లాడరు, గౌరవిస్తారు కూడ. అప్పుడు దేవుడి గొప్పదనం అర్థమౌతుంది కూడ. అందుకే చిన్న వయసు నుండి అలాంటి అలవాటు నేర్చుకోవాలి.

## సదాచారం, సద్గుణాలు

సాధారణంగా ప్రజలు సంపాదనపరునిపై శ్రద్ధ చూపుతారు. జపం, ధ్యానం పూజలపై శ్రద్ధ చూపినపుడు ఇతరుల

అభిప్రాయాలను లెక్కచేయం. మనం చేసే మంచి కార్యాల మీద ధ్యాస పెరిగినప్పుడు మీ ధనం, మీ అధికారము, బంధువర్గం మీ గురించి ఏమనుకుంటున్నారన్నది లెక్కలోకి రావు. సదాచారం, సద్గుణాలతో వున్న వ్యక్తి సమక్షమే అప్రయత్నంగా ఇతరులకు మంచిని చేకూరుస్తుంది. సూర్య భగవానుడు తనను మనం మెచ్చుకుంటున్నామా లేదా అన్న దానిని గమనించి చూడడు. ఆయన ఉదయించిన తరువాత ఎన్నో కార్యక్రమాలు జరుగుతూనే వుంటాయి. ఏ ఇతర వ్యవహారాలతో సంబంధం లేకుండ తన పని తాను చేసుకుపోతుంటాడు సూర్యుడు.

భగవంతుడు తానున్న చోట నుండి లోకంలోని ప్రజలందరిపై ప్రభావం చూపుతుంటాడు. మంచితనం యొక్క శక్తి అలాంటిది. కాని ఆ గుణం ఒక వృత్తి, వ్యాపారం లాగా మనం సాగిస్తే మాత్రం దాని వల్ల ఎవరికీ మంచి అభిప్రాయం ఏర్పడదు. మంచితనాన్ని గురించి చెబుతారు తప్ప అతను అలాంటివాడు కాడన్న అభిప్రాయానికి వస్తారు. అది ఇతరులపై ఎలాంటి మార్పును తీసుకుని రాలేదు. ఇతరులపై ఒక స్థిరమైన అభిప్రాయం కలుగదు. అతనంతా మంచి చెబుతాడు కాని మంచివాడు కాదు అనుకుంటారు. దాని వల్ల ఏ మార్పులూ వుండవు.

**తాత్కాలిక ఆనందం**

ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. మంచి జరుగుతుందని ఆచరించే పనులు కొంతవరకు ఆనందాన్ని

కలిగిస్తాయి కాని మితిమీరితే సుఖాన్ని కలిగించవు. తాత్కాలికంగా హాయినిచ్చినా తరువాత తిరిగి దుఃఖాన్ని కలిగించక ఆనందాన్ని పొందాలంటే, ఆ ఉన్నత శక్తికి శరణాగతి చెందాలి. త్యాగం పూర్తిగా అలవరచుకున్నప్పుడే శాశ్వత సుఖం కలుగుతుంది. అహాన్ని విడిచి పెట్టడం అన్నిటికంటే కష్టమైనది. అహంకార, మమకారాలను త్యజించినప్పుడే పరమశాంతి శాశ్వతంగా పొందడం సాధ్యమవుతుంది.

గొప్ప జ్ఞానులు దాన్ని సాధించడానికి అవసరమైనది మనలోనే వుందని గుర్తిస్తారు. మన హృదయాలలో, ఎప్పుడూ నేను, నేను అని ప్రకాశిస్తున్నదేదో వుంది. 'అహమితి సాక్షాత్' అహమన్న దానికి వేరుగా 'నేను' అన్నదేదో హృదయ కుహరంలో వెలుగుతూ వుంటుంది. అది 'ఆత్మ' రూపంలో ప్రకాశిస్తుంటుందని భగవాన్ చెబుతారు. అది ఇక్కడే, లోపలే, నిరంతరం ప్రత్యక్షంగా వుంటుంది, అందుకే దాని కోసం బయట ఎక్కడో వెదకాల్సిన పని లేదంటారు. ఉపనిషత్తు కూడ శాశ్వత పరమానంద స్థితి, స్వర్గం, నరకం, అంటూ బయట ఎక్కడో కాదు నీ హృదయంలోపలే వున్నదని ఘోషిస్తుంది, దాన్ని అందుకునేందుకు ధ్యాన అవసరమన్నారు.

కాని, భగవంతుని కృప లేకుండ అలాంటి ధ్యానాన్ని విజయవంతంగా చేయడం సాధ్యం కాదు. అందుకే మన పూర్వులు దేవాలయాలు, పుణ్యక్షేత్రాలు, సత్సంగాలకు వెళ్ళమని సలహా ఇచ్చేవారు. క్రమేపి, భగవంతుడు మనలోపలనే వున్నాడన్నది

తెలియవస్తుంది. ఆ విషయం విశదమైన క్షణమే ప్రతి వ్యక్తిలోను ఆయనను చూడగలుగుతాం. తమ తమ శక్త్యానుసారం పూజ, జపాదులను మనఃపూర్వకంగా నిర్వహిస్తూ భగవంతుడు అంతర్గతంగా నెలకొన్నాడని స్వయంగా నమ్మితే బాహ్య విషయాలేవీ ప్రభావితం చేయలేవు. ఆ స్థితిని చేరడానికి భగవత్కృప అవసరం.

## హేతుబద్ధత పనిచేయదు

మరొక విషయం నిత్యజీవితంలో ముఖ్యమైన నిర్ణయాలు తర్కపూర్వకమైన విచక్షణతో తీసుకుంటామని భావిస్తాము. కాని అది యథార్థం కాదు. తరచు భావోద్వేగాల ఆధారంగా అలా చేస్తుంటాము. ఫలానా వ్యక్తి అంటే నాకు చాలా ఇష్టం అంటే, దానికి కారణం చెప్పగలరా? ఆ మనిషిని మీరు ప్రేమిస్తున్నారు, కాని దానికి తగిన కారణాన్ని ఇవ్వలేరు. అదేమిటి? ఆ వ్యక్తిని ప్రేమించడం ఏమిటి? అని అంటాము. అలా ప్రశ్నించేవారు ఆ మొత్తం సందర్భాన్ని హేతుబద్ధమైనదా, కాదా అన్న దృష్టితో విచారిస్తారు. కాని ప్రేమ అన్నది హృదయానికి సంబంధించినది, మనసుకు సంబంధించినది కాదు. ఇద్దరు వ్యక్తులు ప్రేమలో పడినప్పుడు ఎవ్వరూ చెప్పలేని రీతిలో అలా ప్రవర్తిస్తారు. ఆ ఇద్దరికీ సంబంధించినంత వరకు ప్రేమ గుడ్డిది. ఇక తల్లిదండ్రులు, స్నేహితులు, ఇతరులు దానిని అంగీకరించక పోవచ్చు. దానికి కారణం వాళ్ళూ ఇవ్వలేరు. ఎందుకంటే వారు మనసులు తప్ప,

తమ హృదయాలతో అందులో పాలుపంచుకోలేరు. అది పరస్పర హృదయాల కలయిక అని గుర్తించలేరు. ఇది మన ప్రతినిత్యం చూస్తేనే వుంటాం. హృదయాలకు సంబంధించిన విషయంలో తర్కం, హేతుబద్ధత చోటు చేసుకోలేవు.

అలాగే, నేను ఆవు యొక్క పాలు రక్తం అంటే కూడ అలాంటి పరిస్థితే ఏర్పడుతుంది. పాలు ఎందుకు త్రాగుతావు? కొంత నెత్తురు తీసుకొని త్రాగవచ్చు కదా అని అడిగితే ఏమీ నీకు వెఱ్ఱి పట్టిందా, అంటారు. నీవు ఆవుపాలు అనుకునేది నిజంగా ఆవు రక్తం. అది కావచ్చునేమో కాని నాకు పాల రుచి ఇష్టం. రక్తం పాలగా మారి వుండవచ్చు గాని, అయినప్పటికీ నేను రక్తాన్ని తాగలేను. హేతువాదులు అలాగ చేయమంటారు. ఆవుకూ పాలకూ తేడా ఏమిటి? ఒక్క జ్ఞాని మాత్రమే పాలకూ, ఆవుకూ వున్న తేడాను గ్రహించుమంటాడు. ఈనాటికీ, 'అఘోరీలు' (ముఖ్యంగా వారణాసి మొదలైన ప్రాంతాల్లో వుండేవారు) వైరాగ్యాన్ని పెంపొందించుకునేందుకు అలాంటివి ఆచరిస్తారు. వారు ఏ తేడాలూ గుర్తించరు. ఇది మంచిది, ఇది కాదు అన్న దృష్టితో చూడరు. స్మశానాల్లో మండుతున్న శవాలను తింటారు. కుక్క నోటి దగ్గరి మాంసం ముక్కను లాక్కొని తినడానికి సందేహించరు. కొద్దిమంది ''సమచిత్తత'' పెంపొందించడానికి అలాగ ప్రవర్తిస్తారు. ఇది 'పవిత్రమైనది', ఇది 'దైవదూషణం' అన్న భావన వారికి వుండదు. వారి ఉద్దేశంలో సర్వం ఒకటే. అలాంటి ప్రవర్తన సాక్షాత్కారానికి దారి తీస్తుందా అన్నది వేరే విషయం. సంఖ్య కొద్దిదే కావచ్చు కాని

అలాంటి వాళ్ళు కూడ వున్నారు. మనలాగా వాళ్ళకు ఇష్టాయిష్టా లంటూ వుండవు. మనం ఆవుపాలు, నెత్తురుల మధ్య భేదాన్ని చూపుతాం. అందులోని 'తర్క' వాదాన్ని మనం అంగీకరించం.

అలాగే భగవంతుడు మనలోపలే వున్నాడన్న విషయాన్ని ఒప్పుకోం. దేవుడు మనయందే వున్నాడని చెప్పిన క్షణంలో మానసికంగా అది అంగీకారాన్ని పొందవచ్చునేమో గాని భావోద్వేగ పరంగా అది యథార్థమనుకోము. నా గురించి నేను ఆలోచించి నప్పుడు, లోనుండి దారుణము, అసంబద్ధమైన ఆలోచనలు బయటపడతాయి. అలాంటి సమయాలలో అవి నిత్యం ప్రకాశిస్తున్న ఆత్మ నుండి ఉద్భవిస్తున్నాయన్న దానిని అవగాహన చేసుకొనడంలో ఇబ్బంది పడతాం. మనం ప్రత్యక్షంగా అనుభవించని దానిని అంగీకరించడం కష్టం. అయినప్పటికీ మనం ఆ విషయాన్ని ఒప్పుకోవచ్చు. నమ్మకమంటే విశ్వాసము. ఒక విషయాన్ని అనుభవించిన తరువాత, ఇక నమ్మకమన్న ప్రశ్న వుదయించదు. మనల్ని ఎవరైనా 'జాంగిరి' రుచి ఎలాగ వుంటుందని అడిగితే అప్పటికి దాన్ని రుచి చూడలేదు కాబట్టి అది తియ్యగా వుంటుందనుకుంటామని చెబుతాం, అప్పటికి కాని ఆ మిఠాయి రుచిని అప్పటికే అనుభవించి వుంటే, అది తియ్యగా వుంటుందని అంటాము 'అనుకొంటున్నాను' అని చెప్పము.

అదే విధంగా మీ అబ్బాయి ఎక్కడ వున్నాడు? అని ఎవరైనా అడిగితే అతను చెన్నైలో వున్నాడని చెబుతాం. కాని జవాబు అతడు చెన్నైలో వున్నాడనుకుంటానని వస్తే, ఆ విషయం మీకు తెలియదని

అర్థమౌతుంది. ఇతరులెవరైనా మీ అబ్బాయి చెన్నై వెళ్ళాడని చెబితే మీరు అలాగ చెన్నైలో వున్నాడనుకుంటున్నానని అనాల్సి వస్తుంది. అంటే మీకు ఆ సంగతి తెలియదన్న మాట. ఇందులో ప్రత్యక్ష అనుభవం లేదు. అందుకే దేవుడున్నాడని నమ్ముతున్నాను అనడం మనం వింటుంటాం. దేవుడున్నాడన్న నమ్మకం వుండడం, ప్రాథమికంగా మంచి ఉద్దేశమే. దేవుడిని గురించిన అనుభవం వుంటే జవాబు మరొక రకంగా వుంటుంది. కేవలం నమ్ముతున్నా నన్నది అనడం జరగదు. స్వామి వివేకానంద తనకు దేవుడిని చూపించగలరా అని రామకృష్ణుల వారిని అడిగారు. ఆ సందర్భంలో దేవుడిని చూశాను అంటే ఆ ఉన్నత శక్తి యొక్క అన్ని అవతారాలకూ అన్వయిస్తుంది. కాని నామ, రూపాలు లేని భగవంతుని చూశాను అన్నప్పుడు, నీవు నేనే దేవుడు అన్న అర్థం అన్వయించుకోవాలి. ఆ పరిస్థితిలో ఎవరూ దేవుడిని చూశానని గాని, చూడలేదనిగాని చెప్పలేరు. మౌనం మాత్రమే సమాధాన మౌతుంది. నేను చూశాను, నీవు ఆ అనుభవాన్ని పొందితే నీవూ దేవుడవుతావని చెప్పడం కుదరదు. అందుకే అలాంటి అనుభవం ఉన్న దాన్ని మాటల్లో తెలియబరచలేమని అంటారు. అరుణాచలుడు ఎవరు అని నేను చెప్పలేనని భగవాన్ ఖచ్చితంగా అన్నారు. నేను అరుణాచలం వచ్చినప్పుడు అతడిని చూశాననిగాని, చూడలేదనిగాని చెప్పడానికి అప్పుడు ఎవరూ లేరు. అది పరస్పరం ఖండించుకునే విపరీతమైన స్థితి. మాటలలో ఖచ్చితంగా వర్ణించ లేని స్థితి, అన్నారు.

# శ్రీ భగవాన్ నా జీవితంలోకి ఎలా ప్రవేశించారు

శ్రీ వెంకట్రామ శర్మ

శ్రీ వెంకట్రామ శర్మ గారు ఆత్మ తత్వాన్ని నిశితంగా పరిశీలించి, శోధించి అనుభూతి చెందుతున్న వారు. వారు చిన్నతనం నుండీ ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నారు. వారి తండ్రి గారు వారి చిన్నతనం లోనే "నీ జీవిత లక్ష్యం ఆత్మ సాక్షాత్కారం పొందటం" అని బోధించే వారట. వారే, వీరికి 'గోస్పెల్ ఆఫ్ శ్రీరామకృష్ణ" అనే గ్రంథాన్ని ఇచ్చారట. శ్రీ వెంకట్రామ శర్మ గారు ఎంతగా శ్రీ రామకృష్ణ పరమహంస సూచించిన మార్గాన్ని అనుసరించేవారంటే, ఎవరైనా ఇతర మార్గాలను అనుసరించే వారు తారసపడితే వారితో విభేదించి, వారనుసరిస్తున్న మార్గాలను తీవ్రంగా ఖండించే వారు. అటువంటి వారు శ్రీరమణ మార్గంలోకి వచ్చిన తరువాత వారికి ఆధ్యాత్మిక పరంగా అంతవరకూ ఉన్న కొన్ని చిక్కుముడులను భగవాన్ యే విధంగా తొలగించారో వారే ఇక్కడ తెలియ చేస్తున్నారు. ఎంతో కాలంగా శ్రీరమణ మార్గాన్ని అనుసరిస్తూ ఆత్మ సాక్షాత్కారాన్ని అనుభూతి చెందటంలో వారెంతో సాధన చేసి ఉత్తమ స్థితిలో వున్నా కూడా, వారెంతో వినయంతో ఆత్మ జ్ఞానం గురించి భగవాన్ ఏమి తెలియచేసారో నాకిప్పటికీ అర్థం కాలేదు అని అంటూ వుంటారు. వారు 2000వ సంవత్సరంలో స్వచ్ఛంద పదవీ విరమణ చేసి ఈ 'నేను' ఎవరో తెలుసుకొనే ప్రయత్నంలో తీవ్రమైన సాధన చేశారు. అలాంటి వారు శ్రీరమణ మార్గంలోకి ఎలా వచ్చారో,

తర్వాత ఈ ప్రస్థానంలో వారికి కలిగిన అనుభూతులేమిటో వారి మాటల్లోనే...

నేను 1952వ సంవత్సరం డిసెంబర్ 4వ తారీకున శ్రీమతి వెంకట లక్ష్మి, శ్రీ రాధాకృష్ణ మూర్తి గార్లకు జన్మించాను. నేను పంజాబ్ నేషనల్ బ్యాంకులో పని చేసి 2000వ సంవత్సరంలో స్వచ్ఛంద పదవీ విరమణ చేసాను. నాన్నగారు నా మొదటి గురువు. వారు గొప్ప రామభక్తులు. వారెంతో భావ పారవశ్యంతో శ్రీరాముల వారి కీర్తనలు పాడుతున్నప్పుడు కళ్ళ వెంబడి కన్నీరు కారేది. అది చూసి నేను పారవశ్యం చెందటంతో నాకు కూడా కన్నీరు కారేది.

చిన్నప్పటి నుండీ నాలో ఒక భావన ఉండేది. అదేమిటంటే నేను ఇతరులలాంటి వాడని కానని, భగవంతుడు ఎన్నుకొన్న కొందరిలో నేను ఒకడిని అని నాకనిపిస్తూ ఉండేది. నేనీ భూమి మీద ఆ భగవంతుని ప్రతినిధిని అని అనుకొనే వాణ్ని. ఈ భూమి మీదకి సత్యమేమిటో తెలుసుకోవటానికి మాత్రమే వచ్చానని 14వ ఏట నుండి నాకన్పించేది. నేను సీతా రామాంజనేయ సంవాదాన్ని, అలానే వివేక చూడామణిని నా 14వ ఏటనో 15వ ఏటనో చదివేసాను. అది చదివినప్పుడు వాటిలో వున్న అతి సూక్ష్మమైన కొన్నింటిని మాత్రమే నేను ఇంకా తెలుసుకోవాల్సి ఉన్నది తప్ప మిగిలినదంతా నాకు ముందే తెలుసు అని నాకన్పించింది. ఆ సమయంలో నాకెలా అన్పించేదంటే మరుసటి రోజు భగవంతుడు వచ్చి నాకంతా తెలియచేస్తాడు. అప్పుడు నేను భగవంతునితో వెళ్ళి పోతాను అని అనుకొనేవాడిని. ఇదంతా గమనించిన మా కుటుంబ

సభ్యులు "నీకు నీవేదో ఒక అసాధారణ వ్యక్తివని అనుకుంటున్నావు, అది నీ భ్రమ" అని అనేవారు. ఇంకా చెప్పాలంటే మా కుటుంబం లోని కొంతమంది నేను గొప్పలు చెబుతున్నానని అనుకొనే వారు. కానీ నేనెప్పుడూ అలాగ యేమీ అనుకొనే వాణ్ని కాదు. నేను నా సహజ స్థితిలో ఉండేవాన్ని. ఇతరులకు మాత్రం నేను ఏదో గొప్పలు పోతున్నట్లు అనిపించేది.

నా చిన్నతనంలో అంటే కాలేజీ చదువులకు వెళ్ళే ముందు నాకు హస్త సాముద్రికం బాగా తెలుసని తెలిసిన వాళ్ళు, మా బంధువులు వచ్చి నన్ను వారి జీవితానికి సంబంధించిన ప్రశ్నలు అడిగే వారు. నేను ఏది చెబితే అది వాళ్లకు అయ్యేది. కానీ అది నేను ఏ శాస్త్రము చదివి చెప్పలేదు. అలా కొంత కాలం చెప్పిన తరువాత నేనెందుకు యిదంతా చెపుతున్నాను. నేనేమి చేస్తున్నాను? ఓకే, నేనేదో చెబుతాను, వాళ్ళు వాళ్ళకున్న కష్టాలను పోగొట్టుకోవ టానికి భగవంతుని దగ్గరకో లేక ఇంకెక్కడికో వెళ్లి ప్రార్థిస్తారు, లేదా ఏదో ఒక పూజో చేస్తారు. లేదా ఇంకేదైనా చేస్తారు. దానికి హస్త సాముద్రికం ఎందుకు తెలుసుకోవటం? అది తెలుసుకోక పోయినా భగవంతుని ప్రార్థించవచ్చు కదా! మొదటి నుండీ భగవంతుని ప్రార్థిస్తూ వుండవచ్చు కదా! కష్టం వచ్చినప్పుడే భగవంతున్ని ఎందుకడగాలి? అని అనుకొని హస్త సాముద్రికం చెప్పటం మానివేశాను.

నేను శ్రీరామకృష్ణ పరమహంస వారి భావాలతో ఏకీభవించి వారి మార్గాన్ని ఎంతో శ్రద్ధగా, ధృఢమైన నమ్మకంతో అనుసరించే

వాడిని. శ్రీ రామకృష్ణులు వారి గోస్పెల్ చదువుతూ ఉండేవాడిని. చదవటం అంటే ఒక రోజులో ఏదేని ఒక సమయంలో అతి కష్టం మీద సగం పేజీ చదివేటప్పటికే నేనొక పారవశ్య స్థితిలోకి వెళ్లి పోయేవాడిని. దాంతో ఒక పేజీ పూర్తిగా చదవటం గగనమయ్యేది. శ్రీరామకృష్ణుల వారి తత్వాన్ని ఎంత ధృడంగా అనుసరించే వాడినంటే, ఎవరైనా ఇతర మార్గాలను అనుసరించేవారు ఆ మార్గాలలోని భావాలను వ్యక్తపరిస్తే వారితో శత్రుత్వం పెంచుకొనే వాడిని. వారి భావాలను తీవ్రంగా ఖండించే వాడిని. వేరే మార్గాలు సరైనవి కావని వారితో పోరాడే వాడిని. అటువంటి స్థితిలో నాకు గుర్తున్నంత వరకూ 1975వ సంవత్సరంలో అనుకొంటాను, ఒకసారి నాగపూర్‌లో ఉంటున్న మా మేనమామ గారి ఇంటికి వెళ్లాను. అక్కడ ఒకరోజున వారు తెలుగులో ఉన్న సూరినాగమ్మ గారి లేఖలను చదువుతూ ఉన్నారు. వారు నాకు శ్రీ భగవాన్ గురించి చెప్పారు. కానీ శ్రీరామకృష్ణుల వారి ప్రభావం నా మీద ఎంతగా ఉండేదంటే వీళ్ళందరూ పనికి మాలిన వాళ్ళు. ఎవరో ఒక స్త్రీ, ఎవరో ఒక స్వామిని గురించి వ్రాసి ఉంటుంది. ఈ స్వాములంతా పనికిమాలిన వాళ్ళు. వీళ్ళందరూ పిచ్చోళ్ళలా ఆ స్వాముల గురించి వ్రాసిన వాటిని చదువుకొంటూ ఉంటారు అని నా మనసులో అనుకొన్నాను. ఆ తరువాత భగవాన్ గురించిన విషయం మరల పట్టించుకోలేదు. 1981వ సంవత్సరంలో నాకు వివాహమయింది. సద్గురు స్వామి శివానంద మూర్తి గారు నా శ్రీమతికి గురువు గారు. స్వామి శివానంద మూర్తిగారి అంతేవాసి నా శ్రీమతికి మేనమామ.

స్వామివారు శ్రీభగవాన్‌ను గురించి ఎన్నో సందర్భాలలో ప్రస్తావించే వారట. అందువల్ల నా శ్రీమతి, వివాహమైన తరువాత శ్రీ భగవాన్ ఫోటో ఒకటి తనతో పాటు తెచ్చుకొన్నది. నేను నా శ్రీమతితో ఆ ఫోటోలోని వ్యక్తిని చూపించి ఎవరీ ముసలాయన అని అడిగాను. తను శ్రీ భగవాన్‌ను గురించి చెప్పినా పెద్దగా పట్టించుకోలేదు. 1984వ సంవత్సరంలో నేను హైదరాబాద్‌కు వచ్చిన తరువాత ఒకరోజు మా మామగారింటికి వెళ్లాను. అక్కడ ఒక పుస్తకాన్ని చూసాను. అది శ్రీరమణుల యొక్క Talks with Sri Ramana Maharshi (శ్రీరమణ మహర్షితో సంభాషణలు) అనే పుస్తకం. దాన్ని తీసి మామూలుగా చదవటం మొదలు పెట్టాను. అది చదువుతూ ఉన్నప్పుడు నాకు దాని యందు ఆసక్తి కలిగి నేను ఆ పుస్తకాన్ని ఇంటికి తీసుకొని వెళ్తాను అని అన్నాను. దానికి మా మామగారు సరేనని అన్నారు. దాంతో ఆ రాత్రి మొత్తం దాన్ని చదివాను. తెల్లవారు జామున 4 గంటలకల్లా దాన్ని చదివేసి ఒక నిర్ణయానికి వచ్చాను.

ఈ పుస్తకంలో ఒకచోట హృదయం గురించి వ్రాసి ఉన్నది. అది తప్ప ఇందులో ఏమీ అంత తెలుసుకోదగినది గానీ, తెలుసుకో వలసినది గానీ లేదు అని అనుకొన్నాను. శ్రీరామకృష్ణులు చెప్పిన దాని కంటే భిన్నంగా శ్రీ భగవాన్ ఏదైనా చెప్పారని అనుకొంటే అది మనసుని హృదయంలో స్థితం చేయాలి అని. ఈ ఒక్క వాక్యమే ఈ పుస్తకం మొత్తం మీద నేను తెలుసుకో దగ్గది తప్ప ఇంకేమీ లేదు, అని దాన్ని పెద్దగా పట్టించుకోలేదు. అది చదివిన తరువాత

నెమ్మదిగా నాలో ఏదో మార్పు రావటం మొదలైంది. ఎందుకంటే శ్రీరామకృష్ణుల వారిని ఎవరో ఒకరు ఇలా అడిగారట. ఎవరైనా ఒక వ్యక్తి నిర్వికల్ప సమాధిలోకి వెళ్లి ఆత్మ సాక్షాత్కారం పొందితే 21 రోజుల కంటే ఎక్కువ రోజులు శరీరంతో వుండరు. దీనికి శ్రీరమణులతో సంభాషణలలో శ్రీ భగవాన్ "అలా జరగాలనే గ్యారెంటీ ఏమీ లేదు అని అన్నారు. వారి, వారి ప్రారబ్ధం ప్రకారం జరగవచ్చు" అని అన్నారు. ఆ ఒక్క వాక్యం నన్ను ఈ విధంగా ఆలోచింప చేసింది.

ఈ మహానుభావుడు శ్రీరామకృష్ణుల కంటే భిన్నంగా వున్నారు. వీరు శాస్త్రీయ పరంగానూ, తార్కికంగానూ నాకు శ్రీరామకృష్ణుల వారి వద్ద దొరకని లేదా నాకు అర్థం కాని వాటికి వివరణ యిస్తారు అని అనిపించింది. శ్రీరామకృష్ణుల వారి బోధలో నేను ఛేదించలేని రహస్యాలను లేదా అక్కడ దొరకని కొన్ని లింకులను శ్రీ భగవాన్ చూపిస్తారని అనిపించింది. అలా నేను శ్రీరమణుల తత్వాన్ని చదవటం మొదలు పెట్టాను. చదవటం అనటం కంటే విచారణ చేయటం మొదలు పెట్టాను. అలా ఉండగా 1984వ సంవత్సరంలో నేను మద్రాస్‌లో ఉద్యోగ విషయమై మా కంట్రోలింగ్ ఆఫీసుకు వెళ్లినప్పుడు, ఎలాగైనా ఒకసారి తిరువణ్ణామలైలో ఉన్న శ్రీరమణాశ్రమానికి మాత్రమే వెళ్లాలని అనిపించింది. అలా అనుకొని అక్కడకు వెళ్ళిన తరువాత, ఎవరో ఒకరు మీరింకేమయినా చూడండి అని అన్నారు. నేనప్పుడు వారితో లేదు, నేను భగవాన్ సమాధిని మాత్రమే చూడాలని వచ్చాను.

భగవాన్ సన్నిధిని అనుభూతి చెందాలని మాత్రమే ఇక్కడకు వచ్చాను. ఇంకెక్కడికి వెళ్లాలని లేదు అని అన్నాను. దాంతో వారు సర్లేండి, ఒకసారి స్కందాశ్రమానికి ఎందుకు వెళ్ళ కూడదు అని అన్నారు. దానికి నేను సరేనని చెప్పి స్కందాశ్రమం వెళ్తూ ఉంటే, మధ్యలో నేను వేసుకొన్న హవాయి చెప్పులలో ఒకటి తెగిపోయి దూరంగా పడింది. అలా జరగగానే నాలో ఎన్నో భావాలు, ఆలోచనలూ, చిరాకూ మొదలైంది. ఏంటిది? చెప్పులు లేకుండా ఎలా పైకి వెళ్ళేది? ఎందుకిలా జరిగింది? ఏం జరుగుతోంది? ఎటువంటి సేఫ్టీ పిన్ను నా చేతిలో లేదే! ఇప్పుడెలా అని అనుకొని చెప్పును తీసుకొందామని దగ్గరకు వెళితే అక్కడ ఒక కొత్త సేఫ్టీ పిన్ను చెప్పు పక్కనే కనపడింది. అది నాకోసమే అక్కడ పెట్టి ఉన్నదా! అని ఆశ్చర్యమేసింది. ఆ సంఘటన చాలా అసాధారణంగా అనిపించింది. అయినా ఆ పిన్నును చెప్పుకు పెట్టుకొని పైకి వెళ్ళటం మొదలు పెట్టాను.

కొండ పైకి వెళ్తున్న దారిలో కొంతమంది విదేశీయులు ఎంతో ఆనందంగా ఆడుకొంటూ ఉన్నారు. అది చూసి నాకు, వీళ్ళు ఇంత ఆనందంగా ఎలా ఉండ గలుగుతున్నారు? అని అనిపించింది. వాళ్ళ ముఖాలలో ఆనందం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఆ తరువాత ఎవరో, వీళ్ళు ఆర్థర్ ఆస్బోర్న్ గారి పిల్లలు అని చెప్పారు. ఈ సంఘటన నన్ను మరింత విచారణ చేసే విధంగా చేసిందని అనిపిస్తుంది. నన్ను అలా విచారణ చేసే విధంగా, అటువంటి సందర్భాన్ని భగవానే సృష్టించారని నాకనిపిస్తుంది. ఆ తరువాత

కొన్ని పుస్తకాలను కొనుక్కొని అక్కడి నుండి తిరిగి వచ్చిన తరువాత వాటిని చదవటం మొదలు పెట్టాను. అప్పటి నుండి ప్రతీ 6 నెలలకు ఒకసారైనా అరుణాచలం వెళ్ళేవాడిని. అలా వెళ్ళే ప్రతీసారీ ఎప్పుడు కూడా శ్రీరమణాశ్రమం వస్తున్నట్లు ఆశ్రమం వారికి తెలియ చేసేవాడిని కాదు. అయినా నాకు ఆశ్రమం వారు విడిదిని ఏర్పాటు చేసేవారు. ఇంకా చెప్పాలంటే నేనే కావాలని ఆశ్రమం వారికి తెలియచేయకుండా వెళ్లాలని అనుకొనేవాడిని. ఎందుకంటే అలా అయినా భగవాన్ నన్ను లోపలికి రానిస్తారా లేదా? వసతి కల్పిస్తారా లేదా? అనేది తెలుసుకోవాలని ఆశ్రమం వారికి ముందు తెలియ చేసేవాడిని కాదు. కానీ నేనెప్పుడు వెళ్ళినా నాకు వసతి గృహం ఏర్పాటు చేసేవారు ఆశ్రమం వారు. సాధారణంగా నేనక్కడికి వెళ్ళినప్పుడల్లా మూడు నుండి నాల్గు రోజులు ఉండేవాడిని. ఒక్కొక్కసారి 3 లేదా 4 గంటలు మాత్రమే ఉండేవాడిని. మా కంట్రోలింగ్ ఆఫీస్ ఒకటి మద్రాస్‌లో, ఇంకొకటి బెంగుళూర్‌లో ఉండేది. రెండిటికీ కూడా అరుణాచలం దగ్గరే. అలా మా ఆఫీసుకు వెళ్ళినప్పుడల్లా ఖచ్చితంగా అరుణాచలం వెళ్ళేవాడిని. అలా ఒకసారి వర్షాకాలంలో రాత్రి 7.30 లేదా 8 గంటల వేళ అరుణాచలం వెళ్లాలని అనిపించింది. అప్పుడు నేను మద్రాస్‌లో వున్న ఆఫీసుకు పని మీద వచ్చాను. నాతోపాటు వచ్చిన వారికి నా సామాను తీసుకొని మీరు విమానాశ్రయానికి వెళ్ళిపోండి. నేను మీతో తరువాత వచ్చి చేరుతాను అని చెప్పి హోటల్ బయటకు వచ్చాను. ఎదురుగుండా ఒక బస్సు అరుణాచలం వెళ్ళేదాన్ని అందుకోవాలని దాని వెంట 1

కి.మీ. వరకూ పరిగెత్తాను. నేను ఇక ఆగిపోదామని అనుకొన్నప్పుడు బస్సు ట్రాఫిక్ వల్ల ఆగటం, నేను మరల పరిగెడితే బస్సు కదలటం జరిగేది మొత్తానికి నేను బస్సును అందుకొని అరుణాచలం చేరే టప్పటికే రాత్రి 12 గంటల కావొస్తోంది. రాత్రి పూట అవటం వలన ఆశ్రమం మూసి ఉన్నది. నేను సమాధి దగ్గరికి వెళ్ళి అక్కడ కాసేపు కూర్చొని ఉండగా గిరి ప్రదక్షిణ చేద్దామనే కోరిక కలిగింది. కానీ అంతకు మునుపు ఒకసారి వెళ్లినప్పుడు రాత్రి పూట ఒంటరిగా వెళ్ళవద్దు. దోపిడీ దొంగలుంటారు, జాగ్రత్త అని హెచ్చరించారు. ఈ హెచ్చరిక గుర్తుకు రావటంతో లోపల భయం కల్గింది. కానీ నాలో గిరి ప్రదక్షిణ చేయాలని బలమైన కోరిక. అదే సమయంలో వాన పడుతుందేమో అనే ఇంకొక ఆలోచన. అలా ఎన్నో ఆలోచనలు వస్తూ వున్నా గిరి ప్రదక్షిణ చేయాలనే నిశ్చయించు కొన్నాను. అదే సమయంలో ఒకాయన ఆశ్రమంలో నుండి బయటకు వస్తున్నారు. నాకు ఆయన అంతకు మునుపే తెలుసు. ఒకసారి దీపం రోజున ఆయన, నేను, ఇంకొకరం కొండ మీదకు కలిసే వెళ్లాం. (సశేషం)

# శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు
## (శ్రీదేవరాజ ముదలియార్)

(గత సంచిక తరువాయి) అనువాదం: జి. శ్రీహరిరావు

తరువాతి సంవత్సరాలలో ఇలాంటి ఫిర్యాదులు చేసినప్పుడు, శ్రీ భగవాన్ కొన్నిసార్లు మౌనంగా ఉండి పోయేవారు. కొన్నిసార్లు, చిరునవ్వి నవ్వి "పాత కథే కదా! కొత్తేమీ కాదు కదా!" అనేవారు.

కానీ నేను మాత్రం శ్రీ భగవాన్ మాటలను, "నీ బాధ నాకు తెలుసు. నీవు ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. జరగవలసినది జరుగుతుంది" అన్నట్లుగా అర్థము చేసుకొనేవాడిని.

ఆత్మ సాక్షాత్కార సాధనలో సత్సంగము యొక్క పాత్ర గురించి ఇక్కడ ముచ్చటించవలసిన అవసరమున్నది. 1935 ప్రాంతంలో, శ్రీ భగవాన్‌కు నేను సన్నిహితుడుగా ఉంటున్న ప్రథమంలో ఒకరోజు ఉదయం 9 గంటల ప్రాంతంలో హాలులో కూర్చొని ఉన్నాను. శ్రీ శేషాద్రి స్వామి గారికి సన్నిహిత శిష్యులయిన శ్రీ వేంకట రామయ్యర్ నా పక్కనే కూర్చొని ఉన్నారు. ఆయన నాకీ సలహా ఇచ్చారు. మనలాంటి వాళ్ళకు ఇదే ఉత్కృష్ట మార్గము. ఆ మాట అంటూ 'ఉన్నది నలుబది అనుబంధము' లోని ఐదవ పద్యము చూపించారు. సత్సంగము యొక్క విశిష్టత అందులో వివరించబడి ఉన్నది. వారితో నేను పూర్తిగా ఏకీభవించాను. ఆ కొద్దిపాటి పరిచయము కూడా శ్రీ భగవాన్ అనుగ్రహముగా భావించాను. అప్పటినుండీ, శ్రీ భగవాన్ ఉపదేశాల వల్ల గానీ, గ్రంథముల పఠనముల వల్లగానీ, సత్సంగము వల్ల పొందగలిగిన

మహాద్భాగ్యము గురించిన అవగాహన నాకు లభించినది. ఒక సందర్భములో శ్రీ భగవాన్ నాతో యోగవాశిష్ఠంలో చెప్పబడిన ఈ విశేషము వివరించిరి; మోక్ష ధామమునకున్న నలుగురు ద్వార పాలకులలో సత్సంగము ఒకరనీ, ఆ నలుగురిలో యే ఒక్కరితో స్నేహము చేసుకున్ననూ మనకు ప్రవేశము సులభమగును. వేరు వేరు సందర్భములలో శ్రీ భగవాన్ కొన్ని శ్లోకములు కూడా ఉదహరించెడివారు. శ్లోకార్థములు ఈ క్రింద పొందుపరచబడినవి!

సాక్షాత్తూ పరమాత్మ స్వరూపుడయిన జ్ఞాని సన్నిధిలో నివసించుటయే ముక్తి. జ్ఞానికి సేవ చేయువారి గొప్పతనము ఎంత ఉత్కృష్టమన్నదన్న వారి పాదములు సదా శిరోధార్యములు. మహోన్నతమయిన జ్ఞానికి, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు కూడా సాటికానప్పుడు, వేరెవరూ వారి సమానులు కాలేరు. (బ్రహ్మగీత)

జ్ఞానికి ఏది కావలయునన్ననూ శ్రీ మహావిష్ణువు దానిని ఆజ్ఞగా భావిస్తాడు. శివుడెల్లెడలా జ్ఞానితోనే సంచరిస్తాడు. దేవతలూ, సచ్ఛీలురైన చక్రవర్తులూ జ్ఞానుల పాదధూళిని ఆరాధిస్తారు. జ్ఞాని పాదాలు తన శిరస్సుపై మోపాలని బ్రహ్మ ప్రార్థిస్తాడు. (కురున్తిరట్టు)

సాధుసాంగత్యముతో అపాయము అదృష్టంగా మారుతుంది; అశుభం శుభంగా మారుతుంది; లోపభూయిష్టమయిన మనుషులు పరిపక్వము చెందిన వారవుదురు. సత్పురుషుల సాంగత్యము గంగా స్నానము వంటిది. ఆ స్నానము చేసిన వారు పునీతులవుదురు. వారికి హోమమూ, యజ్ఞమూ, తీర్థయాత్రలూ, తపస్సూ, దానధర్మాలు వంటి కర్మకాండలు అవసరముండవు. మహాత్ముల

సాంగత్యమును కోరుకో. ఈ జనన మరణాల సాగరాన్ని దాటించే నావ అదే! (జ్ఞాన వాశిష్ఠం)

సత్సంగం వల్ల కలిగే లాభాలను గురించి పురాణాలలో చెప్పబడిన అనేక గాథలను శ్రీ భగవాన్ ద్వారా గానీ, ఇతర గ్రంథాల వల్ల గానీ, పత్రికల వల్లగానీ తెలుసుకున్నాను. కొన్ని సంవత్సరా లుగా శ్రీ భగవాన్ సాంగత్యము లభించిన భాగ్యవంతుడనై వుండి కూడా నేను ఇలాగే ఉన్నాను. నాలో ఎట్టి ఆధ్యాత్మిక పురోగతి కనిపించడం లేదు. ఒకసారి శ్రీ భగవాన్‌ను అడిగాను. "సత్సంగం గురించి చెప్పబడిన ఈ విషయాలన్నీ నిజమేనా?" లేక మన తమిళ కవులకు సహజమయిన "అతిశయోక్తులేనా?"

అప్పటి సందర్భం ఏమిటంటే, 'ఉన్నది నలుబది అనుబంధంలో ఒకటి రెండు పద్యాలను గురించి నేను మాట్లాడు తున్నాను. శ్రీ భగవాన్ చిరునవ్వు నవ్వి, "అది నన్నడక్కండి. అవి ఎలా ఉంటే నేను అలా అనువదించాను," అన్నారు.

సంస్కృత మాతృక నుండి, ఈ ఐదు శ్లోకాలను ఎలా అనువదించారో శ్రీ భగవాన్ తెలియచేశారు. శ్రీ భగవాన్ స్కందాశ్రమంలో ఉన్నప్పుడు కీ.శే. ఎచ్చమ్మగారి సోదరుని కుమార్తె చెల్లమ్మ అప్పటికి చాలా చిన్నది. తను కొన్న మిఠాయిలు ఒక దుకాణం నుండి తీసుకువస్తూ, అవి కట్టబడిన కాగితం మీద సత్సంగమును గురించి ప్రశంసిస్తూ రాయబడిన ఒక పాటను చూసింది. ఆ పాట ఆ అమ్మాయికి బాగా నచ్చి, దానిని కంఠస్థం చేసింది. ఆ పాటను శ్రీ భగవాన్ సమక్షంలో పాడింది. ఆ పాట ఎలా దొరికిందో శ్రీ భగవాన్‌కు వివరించింది. ఆ చిన్న వయస్సులో

ఆ పాట ఆ అమ్మాయికి అంతనచ్చి, పాడిన తీరు శ్రీ భగవాన్‌ను కదిల్చి వేసింది. అంతకు ముందే తాను చూసిన ఆ సంస్కృత శ్లోకాలను, ఆ పాపకోసం తమిళంలోనికి అనువదించారు. కాలక్రమేణా, అవి 'ఉన్నది నలుబది' అనుబంధంలో చేర్చబడ్డాయి.

శ్రీ భగవాన్ నాకు చేసిన అనేక సహాయాల గురించి చెప్పడం కొనసాగిస్తాను. ఒకసారి శ్రీ భగవాన్ జయంతి సందర్భముగా నా మొత్తము కుటుంబాన్ని తీసుకు వెడదామనుకున్నాను. ఖర్చు ఎంతవుతుందని అంచనా వేయగా నూరు రూపాయలు కావాలని తేలింది. అప్పటికి నా గవర్నమెంటు ప్లీడరీ ఉద్యోగమూ, పబ్లిక్ ప్రాసిక్యూటరు ఉద్యోగము కోల్పోవడం వల్ల, నా నెలసరి ఖర్చుల కంటే, నెలసరి ఆదాయము తక్కువైపోయింది. అందువల్ల బాంకులో నుండి వంద రూపాయలు తీద్దామనుకున్నాను. కానీ కొద్ది రోజుల్లోనే, అనుకోకుండా బెంగుళూరు నుండి ఒకరు వచ్చి అక్కడ ఒక కేసులో వాదించడానికి నన్ను నియమించారు. వకాల్తా కోసము ఫీజు 100 రూపాయలకు ఒప్పుకున్నాను. సరిగ్గా జయంతికి కావలసిన పైకము మొత్తం సమకూరింది. ఒక్కమాట చెప్పాలిక్కడ. బాంకు నుండి డబ్బు తీయడానికి నాకు ఎట్టి అయిష్టమూ లేదు. ఆ వందరూపాయల కోసము నేనెట్టి ప్రార్థన చేయడం కానీ, ఆశించడం కానీ చేయలేదు. జయంతి కోసం వంద రూపాయలు బాంకు నుండి తీయడం నాకు పూర్తిగా ఇష్టమే. నా కోర్కెలోని సదుద్దేశము గ్రహించి శ్రీ భగవానే ఆ డబ్బు పంపించారని నేననుకుంటాను. ఆ తొలి రోజులలో మమ్ములను తనకు దగ్గర చేసుకోవడానికి శ్రీ భగవాన్ అలా చేసేవారని నా ఉద్దేశం. నా

సహ భక్తులు కూడా నా ఉద్దేశ్యం సరియైనదనీ వారికి కూడా ఇలాంటి అనుభవాలే కలిగాయని చెప్పి, నా ఆలోచనను బలపరిచేవారు.

మా రెండవ అమ్మాయి మూడవ కాన్పుకు సంబంధించిన ఒక సంఘటన ఇక్కడ తెలియపరచాలి. ఆమె రెండవ కాన్పుకూ, మూడవ కాన్పుకు పది సంవత్సరాల అంతరం ఉండడం వల్లనూ, అమ్మాయి కూడా బలహీనముగా ఉండడం వల్లనూ, నా భార్య స్వర్గస్థురాలవడం వల్లనూ ఇతర పెద్దల సహాయం ఏమీ ఉండక పోవడంవల్లనూ నేను ఈసారి ప్రసవం గురించి చాలా ఆదుర్దా పడ్డాను. ఆమె భర్త నివసించే ఊళ్ళో వైద్యసదుపాయాలు చాలా పరిమితం, వెల్లూర్‌తో పోలిస్తే ఏమీ లేవనే చెప్పాలి. ఈ ఆందోళనలన్నీ శ్రీ భగవాన్‌కు ఉత్తరాల ద్వారా తెలియపరుస్తూ ఉన్నాను. ప్రసవ సమయం సమీపించగానే, మా అల్లుడుకి ఉత్తరం రాశాను. వాళ్ళ ఊరు వచ్చి నేను చేయగలిగిందేమీ ఉండదు కావున నేను శ్రీ భగవాన్ దగ్గరకు ఆశ్రమానికి వెడతానని రాశాను. ఏ అవసరం వచ్చినా నాకు టెలిగ్రామ్ ఇవ్వమని రాశాను. ఈ నా ఉద్దేశం గురించి శ్రీ భగవాన్‌కు కూడా తెలియపరిచాను. ఆశ్రమం నుండి నాకు జవాబు వచ్చింది. నేనేమీ ఆదుర్దా పడనవసరం లేదని, అమ్మాయికి సుఖప్రసవం కలుగుతుందనీ రాశారు. సామాన్యంగా ఆశ్రమం నుండి వచ్చే ఉత్తరం లాగా లేదు. మాములుగా వచ్చే సందేశం ఇలా ఉంటుంది: ‘‘శ్రీ భగవాన్ కృపవల్ల ప్రసవం క్షేమంగా జరుగుతుందని ఆశిస్తున్నాము’’. నాపట్లా, నావారి పట్లా, శ్రీ భగవాన్ ప్రదర్శించిన అపార కరుణకు నిదర్శనమయిన ఇంకొక సంఘటన

గురించి ఇక్కడ ప్రస్తుతించాలి. ఇంతకు ముందు తెలియపరిచిన మనుమడు, మూడు సంవత్సరాల వయస్సులో జబ్బు పడ్డాడు. అప్పుడు మా అల్లుడు కాంచీపురంలో తహసిల్దారుగా పని చేస్తున్నాడు. ఆ ఊళ్ళో వున్న వైద్యసదుపాయాలన్నీ వినియోగించు కున్నప్పటికీ, చాలా రోజులు జ్వరం తగ్గలేదు. ఒకరోజు రాత్రి జ్వరం తీవ్రత ఎక్కువ అవడంతో ఆయన చాలా కంగారు పడ్డారు. శ్రీ భగవాన్ ఆశీర్వచనం వెంటనే అవసరమనుకుని, తెల్లవారు ఝామున నాలుగు గంటలకు నాకు ఉత్తరం రాశారు. అప్పటికి నేను ఆశ్రమంలో స్థిరవాసినై పోయాను. ఉత్తరాన్ని బస్సు కండక్టరు చేతికిచ్చి ఐదు గంటలకు ఇంటికి వెళ్ళి పై అంతస్తులోనున్న బిడ్డ దగ్గరకు పోయి చూడగానే జ్వరము తగ్గిపోయినట్లు గమనించాను. తన ఆర్తనాదం వినగానే శ్రీభగవాన్ చూపిన కరుణ గుర్తించగానే మా అల్లుడు గారి కృతజ్ఞతకు అవధులు లేవు. బిడ్డకు జ్వరం తగ్గినదని తెలిసి ఆయన మనస్సు ఎంతో తేలికపడింది. బస్ కండక్టరు పదకొండు గంటల ప్రాంతంలో అల్లుడు గారు రాసిన ఉత్తరం తెచ్చి ఇచ్చాడు. శ్రీ భగవాన్ అప్పుడే హాలు నుండి భోజనానికి బయల్దేరారు. నేను గబగబా శ్రీ భగవాన్ దగ్గరకు వెళ్ళి, విషయం వివరించి, ప్రసాదం పంపించడానికి అనుమతి తీసు కొన్నాను. నేను కూడా ఒక ఉత్తరం రాసి, దానితో పాటు ప్రసాదం జతపరిచి, ఆ కవరు అదే బస్సు కండక్టరుకు ఇచ్చాను. ఉత్తరంలో, ‘‘కనీసం పదకొండు గంటల నుంచీ, శ్రీ భగవాన్‌కు మీ జాబు చూపించినప్పటినుండీ బిడ్డకు జ్వరము తగ్గుముఖము పట్టి వుండాలని తలుస్తాను’’ అని రాశాను. (సశేషం)

# శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# శ్రీ లక్ష్మణ శర్మ

మల్లాది ఫణిమాల

అసాధారణ ప్రతిభ కలిగినటువంటి శ్రీ కావ్యకంఠ గణపతి ముని, శ్రీ కపాలిశాస్త్రి, శ్రీ జగదీశ శాస్త్రి, శ్రీ దైవరాత, భగవాన్ శ్రీరమణుల భక్తులు. అలాగే శ్రీ మురుగనార్, చెప్పుకోదగ్గ గొప్ప తమిళ కవులలో, అగ్రస్థాయికి చెందినవారు. అలాగే మరొక పండితుడు, కవి అయిన ఒక వ్యక్తి శ్రీరమణుల పాదాల చెంతకు వచ్చారు. ఈ భక్తుడు తనకే గుర్తింపూ లేకుండా, గుర్తింపుకు దూరంగా ఉన్నారు. ఆయన తనను తాను ఎంతగా మరుగు పరచుకునేవారంటే, శ్రీ భగవానుల ''ఆత్మ విచారణ'' పై 'మహా యోగము' అనే గొప్ప గ్రంథాన్ని వ్రాసి, దానిని 'ఎవరు' (WHO) అనే మారుపేరుతో వ్రాశారు.

శ్రీ లక్ష్మణ శర్మ 1920 ప్రాంతాలలో శ్రీ రమణుల వద్దకు చేరారు. శ్రీ రమణుల రచనలను సంస్కృతంలోకి అనువదించారు. తమ రచనల ఆంతర్యం గురించి శ్రీ భగవాన్ స్వయంగా శ్రీ లక్ష్మణ శర్మగారికి వివరించారు. శ్రీ లక్ష్మణ శర్మ సంస్కృతంలో రచించిన బృహద్గ్రంథం 'రమణ పరావిద్యోపనిషత్.

శ్రీ లక్ష్మణ శర్మగారు వృత్తిరీత్యా వకీలు మరియు ప్రకృతి వైద్యుడు. శ్రీ భగవానులు ఒక్క చూపుతోనే ఆయనను వశపరచు

కున్నారు. శ్రీ భగవానులు వారిని, మీరు ఉళ్ళదునార్పదు (ఉన్నది నలుబది) చదివారా అని ప్రశ్నించగా, శ్రీ లక్ష్మణ శర్మ, నేను ఆ పుస్తకాన్ని చదువలేదు. నాకు శాస్త్రీయమైన తమిళం తెలియదు, భగవాన్ అని సమాధానమిచ్చారు.

శ్రీ లక్ష్మణ శర్మ, ''శ్రీరమణులు నేర్పిస్తే తమిళం నేర్చుకుంటాను'' అని కూడా అన్నారు. అలా శ్రీరమణుల వద్ద తమిళం నేర్చుకుని, ఉళ్ళదు నార్పదు చదవవచ్చనేది శ్రీలక్ష్మణ శర్మగారి ఉద్దేశ్యము. శ్రీ లక్ష్మణ శర్మ, తమిళంలో రచింపబడిన నలుబది పద్యాల సంకలనం. శ్రీ లక్ష్మణ శర్మ, శ్రీ రమణులు నేర్పిస్తే తమిళం నేర్చుకుంటారు అని కూడా అన్నారు. అలా శ్రీ రమణుల వద్ద తమిళం నేర్చుకుని, ఉళ్ళదునార్పదు చదవవచ్చునేది శ్రీ లక్ష్మణశర్మగారి ఉద్దేశము. శ్రీ లక్ష్మణశర్మ పట్టుదల, సూక్ష్మబుద్ధి గల సాధకులు. శ్రీరమణుల ప్రశ్నకు శ్రీ లక్ష్మణశర్మ స్పందించిన విధానం, ఆయన ప్రయత్నం చేయటానికి సిద్ధంగా ఉన్నారని, సద్గురుని బోధను అర్థం చేసుకుని, ఆచరించటానికి సంసిద్ధంగా ఉన్నారని తెలుపుతోంది. మనం ఒక్క అడుగు సద్గురుని వైపు వేస్తే, వారు తొంభై తొమ్మిది అడుగులు మన వైపు వేస్తారన్నది సత్యవాక్కు.

శ్రీ లక్ష్మణశర్మగారి సుముఖతను, ఆసక్తిని గమనించిన శ్రీరమణులు ఆయనకు ఏకాంతంగా శాస్త్రీయ తమిళం నేర్పడానికీ, అవసరమైన మార్గదర్శకత్వం నెరపడానికి నిశ్చయించుకుని శ్రీరమణులు తమిళ భాషలోని స్వల్పమైన భేదాలను వివరింపగా,

శ్రీ లక్ష్మణ శర్మ సునాయసంగా వాటిని గ్రహించారు. వారిద్దరూ అటువంటి చక్కటి గురుశిష్య సంబంధాన్ని కలిగి యుండేవారు. త్వరలోనే శ్రీరమణులు ఉళ్ళదునార్పదుని, దాని అనుబంధాన్ని వివరించడం ప్రారంభించారు. శ్రీరమణులు ఎప్పటిలాగే ఎంతో కరుణతో ప్రతిరోజూ, ఎంతో సమయం తీసుకుని, ఆ పద్యాలను చాలా లోతుగా శ్రీ లక్ష్మణ శర్మకు వివరించేవారు. తర్వాత కొన్ని రోజులకి ఆ పుస్తకం ముద్రించబడింది. దానిని ముద్రింప చేయాలనే ఆలోచన శ్రీ లక్ష్మణ శర్మకు ఎన్నడూ ఉండేది కాదు. ఆయన కేవలం, శ్రీరమణులు వారికి బోధించిన విషయాలను, వాటిపై తానెలా సాధన చేశారో ఈ అంశాలను, మాత్రమే వర్ణించారు. శ్రీ లక్ష్మణ శర్మ పలాకొత్తులో ఒక చిన్ని కుటీరంలో నివసించేవారు. ఆయన సంస్కృత పండితుడు కాబట్టి, రాత్రి కుటీరం చేరుకోగానే, పగలు తాను తెలుసుకున్న విషయాలను అన్నింటినీ, సంస్కృతంలో ఒక పద్యరూపంలో వ్రాసేవారు. మరునాడు ఆయన ఆ పద్యాన్ని శ్రీ భగవాన్‌కు చూపించేవారు. వారు దానిని చదివి, సరిచేసే వారు. ఎప్పుడైనా శ్రీ భగవానులు అసంతృప్తిగా ఉన్నారని శ్రీ లక్ష్మణ శర్మ గారికి అనిపిస్తే, ఆ పద్యాన్ని మళ్ళీ వారు తిరిగి వ్రాసేవారు. శ్రీ రమణుల పట్ల అంతటి గురి కలిగి ఉండేవారు శ్రీ లక్ష్మణ శర్మగారు. ఇలా శ్రీ భగవానులు మెచ్చే వరకు ప్రతీ పద్యాన్ని ఎన్ని సార్లైనా వ్రాసేవారు. ఈ విధంగా వారు ఉళ్ళదు నార్పదు పద్యాలన్నింటిని సంస్కృతంలోనికి అనువదించిన గొప్ప భక్తులు. ఆ సంస్కృత అనువాదానికే 'సద్దర్శనం' అనే పేరు పెట్టబడినది. శ్రీ లక్ష్మణ శర్మ

ఈ పద్యాల విషయంలో ఎంత కఠోర పరిశ్రమ చేశారంటే, ఎప్పుడూ, ఎవరి గురించీ ఏమీ మాట్లాడని శ్రీ భగవానులే, "లక్ష్మణ శర్మకిది తపస్సు వంటిది. ఆయన ఆ పద్యాలను ఎన్నోసార్లు సరిదిద్ది, మెరుగుపరచి, ఆ పద్యాలలోనే జీవించారు. ఏ మాత్రం దోషంలేని, సంస్కృత అనువాదం చెయ్యాలని ఎంతో కష్టపడ్డారు, ఫలితాన్ని సాధించారు" అని వారిని ఎంతో శ్లాఘించారు శ్రీరమణులు.

శ్రీ మురుగనార్ ఒకసారి, "శ్రీ లక్ష్మణ శర్మ ఉళ్ళదు నార్పదుగా జీవించారు" అని అన్నారు. వారు అలా అనడంలో ఉద్దేశమేమిటని భక్తులు అడుగగా, శ్రీ మురుగనార్ ఇలా విపులీకరించారు. గురువుగారి ద్వారా ఉళ్ళదు నార్పదులో ఏదైతే బోధింపబడిందో, దానిని హృదయపూర్వకంగా, వీసమెత్తు తేడా లేకుండా, శ్రీ లక్ష్మణ శర్మ ఆచరణలో పెట్టారు. శ్రీ లక్ష్మణశర్మగారు, వారి జీవితం, ఊపిరి, ఆలోచన అన్నీ కూడా ఆ పవిత్రమైన నలుబది పద్యాల గురించే ఉండేవి" అని వారు శ్రీ లక్ష్మణ శర్మను ఎంతగానో మెచ్చుకున్నారు. ఉళ్ళదు నార్పదును ఆంగ్లంలోనికి కూడా అనువదించారు శ్రీ లక్ష్మణశర్మగారు.

శ్రీ లక్ష్మణ శర్మ, శ్రీ మురగనార్ వీరిద్దరూ కూడా శ్రీరమణుల యెడల గాఢమైన భక్తి కలవారు, గొప్ప మిత్రులు కూడా. శ్రీ మురుగనార్ అప్పటికే 'గురువాచక కోవై' "ది గార్లండ్ ఆఫ్ గురూస్ సేయింగ్స్; (గురు వచన రత్నమాల)ని తమిళ పద్యాలలో వ్రాసి యున్నారు. శ్రీ మురుగనార్, శ్రీ లక్ష్మణ శర్మ, వారిద్దరు కలిసి, అందులో నుండి మూడు వందల పద్యాలను ఎంపిక చేశారు. శ్రీ

లక్ష్మణ శర్మ, ఆ పద్యాలను వచన రూపంలో ఆంగ్లంలోనికి అనువదించారు. ఆయన ఆ పుస్తకానికి 'గురురమణ వచనమాల' అని పేరు పెట్టారు. అంతే కాక, శ్రీ లక్ష్మణశర్మ 'శ్రీరమణ హృదయం' అనే గ్రంథాన్ని సంస్కృతంలో వ్రాశారు. ఆయన దానిని ఆంగ్లంలోనికి అనువదించి, దానికి 'రెవలేషన్' అనే పేరు పెట్టారు. ఈ ఆంగ్ల గ్రంథాలన్నీ కూడా, ఆంగ్లము మాత్రమే తెలిసిన శ్రీరమణ భక్తులకు, వారి బోధలు నేరుగా అందజేస్తాయి. శ్రీ లక్ష్మణ శర్మ గారికి, ప్రకృతిచికిత్సలో ఎంతో నమ్మకం ఉండటం చేత, వారు ప్రజలకు వైద్యసేవలందించడానికి వారి స్వగ్రామానికి వెళ్ళారు. వారు రచించిన 'నేచర్ క్యూర్ - ప్రకృతి చికిత్స' అనేది ఆ విషయంపై గొప్ప ప్రామాణిక గ్రంథము. వారు సంస్కృతంలో కూడా ప్రకృతి చికిత్సపై "స్వాధీన స్వాస్థ్య మహా విద్య" అనే గ్రంథాన్ని వ్రాశారు. 1950వ సంవత్సరంలో శ్రీరమణులు శరీరాన్ని విడిచిపెట్టిన తర్వాత కూడా శ్రీ లక్ష్మణ శర్మ శ్రీ భగవానుల బోధలపై సంస్కృతంలో పద్యాలు వ్రాసి, వాటి సంకలనానికి, 'శ్రీరమణ పరావిద్యోపనిషత్' అని పేరు పెట్టారు. శ్రీ రమణాశ్రమం వారు ఆ పుస్తకాన్ని ఇంగ్లీషులో ముద్రింప చేశారు. ఇలా శ్రీరమణుల బోధలపై ఎన్నో పవిత్ర గ్రంథాలను రచించిన శ్రీ లక్ష్మణ శర్మగారి గురుభక్తి, సేవా తత్పరత ఈ రెండూ కూడా ఆచరణ యోగ్యములు.

* * *

## Freedom from the Mind

Talk 134

Dr.K.Subrahmanian

What is *moksha*? *Moksha* literally means 'freedom'. What is this freedom? The freedom that we are all seeking is actually freedom from the mind. Whether we are rich or poor, the thing that bothers us every day is our mind. From the time we get up, to the time we go to bed, we have all kinds of agitation. The moment we go to sleep, however, there is no problem. In deep or dreamless sleep, where the mind is absent, we are very happy. The world is there, but the mind is not present, and therefore, we are not conscious of the world, our body, our name or fame. We are extraordinarily happy because we're in a state where there is no desire of any kind, whatsoever. We seek this kind of happiness where the mind is not present.

Bhagavan says the kind of peace you experience in deep sleep, you can have even in your waking state, so long as there is no ego. It is this state in which the *yogi* is always in, for he has destroyed his mind - *nashtamanaso utkrishtha yoginah*. He, therefore, enjoys a peace that cannot be described. By destroying the mind, he merges into the self - *svasthitim yataha* - and in the process, he sees himself in others, and others in himself. He is in his natural state, one where there is no agitation because there is no mind. This is the highest state according to the *Ashtavakra Gita*.In such a state, what is there for a *yogi*

to do - *krityamasti kim*? As the mind has merged into the self, the yogi doesn't have to do anything. This is an extraordinary state which Bhagavan says you have to experience for yourself, because the moment you are in that state, you're not seeking anything.

We do a variety of things because we are seeking something. When the mind is merged in the self, when we realize ourselves, we understand there is nothing else to realize.There is no world of the kind we see now; we realize we are everything. There is only one : *ekam adhvitheeyam*; there is no other, there is no second. Everything is *atman*; everything is the self. The world that you see outside of you is also the world that is in the *atman*. In other words, there is no in or out; there is only one thing, and that is the *atman*. You will see yourself in the world, and the world in yourself. A state where there is no seeking of any kind, whatsoever; when there is no seeking, you are at peace with yourself.

